ఎక్కడి సమస్యలు అక్కడే..

సనత్‌నగర్‌ పారిశ్రామికవాడ నిర్వహణ తీరు అధ్వానం


పారిశ్రామికవాడలో నిర్మాణ వ్యర్థాల డంపింగ్‌

- దేశంలోనే మొదటి పారిశ్రామికవాడ
- పార్కింగ్‌ అడ్డాగా రహదారులు
- డ్రైనేజీల్లోకే రసాయన వ్యర్థాలు

సనత్‌నగర్‌: దేశంలోనే ప్రప్రథమ పారిశ్రామికవాడగా పేరొందిన సనత్‌నగర్‌ పారిశ్రామికవాడ నిర్వహణ తీరు అధ్వానంగా మారింది. ఒకనాడు దేశ ఆర్థిక వ్యవస్థను శాసించిన ఇండస్ట్రియల్‌ ఎస్టేట్‌ సమస్యలతో సావాసం చేస్తోంది. ప్రధాన పరిశ్రమలన్నీ ఇక్కడి నుంచి తరలిపోగా, ప్రస్తుతం ఫార్మాతో పాటు ఇతరత్రా కార్పొరేట్‌ కార్యాలయాలతో పాటు చిన్నతరహా పరిశ్రమలు, వివిధ రంగాల కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఒకనాడు ఐలా పరిధిలో ఇండస్ట్రియల్‌ ఎస్టేట్‌ నిర్వహణ కొనసాగగా, గత కొన్నేళ్ల క్రితమే జీహెచ్‌ఎంసీ పరిధిలోకి వచ్చింది. అయితే ఇక్కడి నుంచి వివిధ రకాల పన్నుల రూపేణా ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా ఈ ఎస్టేట్‌పై ప్రభుత్వాలు చిన్నచూపు చూడడంపై ఇక్కడి పారిశ్రామికవేత్తలు గగ్గోలు పెడుతూ వస్తున్నారు.

కోట్లలో పన్నులు చెల్లిస్తున్నా.. ఎందుకింత నిర్లక్ష్యం ?

అటు కేంద్రానికి, ఇటు రాష్ట్రానికి వివిధ పన్నుల రూపంలో ఈ పారిశ్రామికవాడ నుంచి కోట్లలో ఆదాయం వస్తున్నా ఎందుకింత నిర్లక్ష్యం చూపుతున్నారని ఇక్కడి వారు వాపోతున్నారు. గతంలో పోరాడితే రోడ్లు వేశారే తప్ప మిగిలిన కనీస సదుపాయాల మాట దేవుడెరుగు..నిర్వహణను కూడా గాలికొదిలేశారని మండిపడుతున్నారు. ముఖ్యంగా ఈ పారిశ్రామికవాడలో ఫార్మా కంపెనీల కార్పొరేట్‌ కార్యాలయాలు, ఫర్నిచర్‌, కెమికల్‌, వివిధ కంపెనీలకు చెందిన కార్ల సర్వీసింగ్‌ షోరూంలు, బ్యాంక్‌లు, పోస్టాఫీసుతో పాటు వివిధ రకాల పరిశ్రమలు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. శానిటేషన్‌ విభాగం ఇటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో గుట్టలుగుట్టలుగా నిర్మాణ వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇక ట్రాఫిక్‌ పోలీసులు సైతం తమ బాధ్యత కాన్నట్లుగా ఇటు వైపు రాకపోవడంతో రోడ్లు తమ జాగీరు అన్నట్లుగా భారీ వాహనాలను పార్కింగ్‌ చేస్తూ రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారు. ఇదిలా ఉంటే వసతులపై దష్టిసారించాల్సిన జీహెచ్‌ఎంసీ ఆ దిశగా ఆలోచన చేయకపోవడంతో రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది సనత్‌నగర్‌ పారిశ్రామికవాడ.

పార్కింగ్‌కు అడ్డానా.. పారిశ్రామికవాడనా..?

సనత్‌నగర్‌ పారిశ్రామికవాడను ఒక్కసారి సందర్శిస్తే ఇది పార్కింగ్‌ అడ్డానా..లేక పారిశ్రామికవాడనా అన్న అనుమానం వస్తుంది. పారిశ్రామికవాడలో ఏ రోడ్డు చూసినా భారీ ట్రాన్స్‌పోర్ట్‌ వాహనాలతో పాటు ఎక్కడికక్కడ నిర్మాణ వ్యర్థాలు, పాడైపోయిన కార్లు నిలిపి ఉంచుతున్నారు. రహదారులకు ఇరువైపులా రోజుల తరబడి వాహనాలను పార్కింగ్‌ చేస్తూ రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితులు కలిగించడంతో పాటు వాటి మాటున అసాంఘిక కార్యకలాపాలు కూడా చోటుచేసుకుంటున్నాయని పలువురు వాపోతున్నారు. ముఖ్యంగా టీజీపీసీబీ కార్యాలయం వెనుక వైపు పాడైపోయిన లారీలు, కార్లను గత కొన్ని సంవత్సరాలుగా అక్కడే ఉంచడంతో రోడ్లే గ్యారేజీను తలపిస్తున్నాయి.


ఏ రోడ్డు చూసినా అక్రమ పార్కింగ్‌ ఇలా


డ్రైనేజీలోకి రసాయనాలను వదలడంతో మ్యాన్‌ హోల్‌ నుంచి ఎగజిమ్మిన మంటలు (ఫైల్‌)

డ్రైనేజీల్లోకే రసాయన వ్యర్థాలు

పారిశ్రామికవాడలో ఉన్న వివిధ కంపెనీల నుంచి వెలువడే రసాయన వ్యర్థాలు బయటకు వెళ్లేందుకు జలమండలి వేసిన డ్రైనేజీలు లేదా జీహెచ్‌ఎంసీ నిర్మించిన వరద కాలువలే గత్యంతరం. గతంలో ఇక్కడి ఓ పరిశ్రమ నేరుగా డ్రైనేజీలోకి రసాయనాలను వదలడం మూలంగా వాటి తీవ్రతకు ఏకంగా మ్యాన్‌హోల్స్‌ సైతం పేలిపోయాయి. అప్పట్లో ఆ సంఘటన పెద్ద సంచలనమే అయ్యింది. ఆయా విభాగాల పర్యవేక్షణ కొరవడడంతో ఇక్కడ ఎవరిష్టానుసారం వారు కార్యకలాపాలు చేసుకోవచ్చనే పరిస్థితి నెలకొందనే చెప్పాలి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పారిశ్రామికవాడ నిర్వహణపై దష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.

జనగణనలో మహిళలను మరిచారు

ఉస్మానియా యూనివర్సిటీ: జనగణనలో మహిళలను మరిచారని తెలంగాణ మహిళ విద్యా వంతుల ఫోరం (టీఎంవీఎస్‌) రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్‌ స్వర్ణలత, ప్రధాన కార్యదర్శి తల్లమల్ల శ్వేతహసేస్‌ సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాభాలో సగభాగమైన మహిళలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనగణనలో విస్మరించడం బాధాకరమన్నారు. కేవలం మహిళ ఓట్లు కావాలి కానీ వారి హక్కులు, జనాభా పరంగా గుర్తింపు ఇవ్వరా అని ప్రశ్నించారు. మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని రాజ్యాంగంలో డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ కల్పించిన 33 శాతం రిజర్వేషన్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సేకరించిన జనగణన నుంచి ప్రతి కులానికి ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీల మహిళల జనాభను వేరు చేసి ప్రత్యేకంగా ప్రటించాలని సీఎం రేవంత్‌ రెడ్డిని కోరారు. మహిళా జనాభ విషయంలో వివిధ మహిళా సంఘాలు మౌనం వహించడం సిగ్గుచేటు అన్నారు.

యువతి అదృశ్యం


శివజ్యోతి (ఫైల్‌)

అడ్డగుట్ట: లాలాగూడ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఓ యువతి అదృశ్యమైంది. ఇన్‌స్పెక్టర్‌ రఘుబాబు తెలిపిన మేరకు.. లాలాపేటలోని లక్ష్మినగర్‌కు చెందిన శివజ్యోతి(19) నాచారంలో డిగ్రీ చదువుతోంది. ఈ నెల 2 ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లిన శివజ్యోతి మళ్లీ తిరిగి రాలేదు. తండ్రి పెద్దిరాజు పరిసర ప్రాంతాలలో వెతికినా ఫలితం లేకపోవడంతో సోమవారం స్థానిక లాలగూడ పోలీస్‌ స్టేషన్‌ను ఆశ్రయించారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్‌: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో...)టమాటా.11, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్‌ 35, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 11, క్యారెట్‌ 19, దొండ 18, గుండుబీన్స్‌ 40, గింజ చిక్కుడు 35, గోకరకాయ 35, కీర 23, దోసకాయ 21, బీట్‌రూట్‌ 19, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 23, చామగడ్డ 40, మొరంగడ్డ 35, కందగడ్డ 55, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటి కాయ 9, మునగకాయ 4-5, ముల్లంగి 3-4. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల పంపిణీ

సికింద్రాబాద్‌: సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎం ఆర్‌ఎఫ్‌ చెక్కులను పంపిణీ చేశారు. కార్పొరేటర్లు లింగాని ప్రసన్నలక్ష్మి, రాసూరి సునీత, కంది శైలజలతో కలిసి బీఆర్‌ఎస్‌ నాయకుడు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్‌ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు కంది నారాయణ, లింగాని శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

ఆలయ హుండీ ఆదాయం రూ.20.45 లక్షలు



రాంగోపాల్‌పేట్‌: సికింద్రాబాద్‌ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి హుండీ ద్వారా రూ.20,45,418 ఆదాయం లభించింది. సోమవారం దేవాలయంలో ఆలయ ఈఓ మనోహర్‌రెడ్డి, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్‌ శ్రీదేవి, ఫౌండర్‌ ఫ్యామిలీ మెంబర్‌ సురిటి రామేశ్వర్‌ భక్తుల సమక్షంలో అమ్మవారి హుండీని లెక్కించారు. అలాగే రూ99,878 నాణేలు కూడా లభించాయి. మాజీ సభ్యులు ప్రకాశ్‌, కేఎం కృష్ణ, అరుణ్‌బట్‌ పాల్గొన్నారు.

భక్తులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోండి


ఆలయ నిర్వహకులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్‌

రసూల్‌పురా: రథ సప్తమి రోజున ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని కంటోన్మెంట్‌ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ అన్నారు. మంగళవారం రథసప్తమి సందర్భంగా కంటోన్మెంట్‌ తిరుమలగిరి లోని సూర్యభగవాన్‌ ఆలయాంలో నిర్వహకులు చేస్తున్న ఏర్పాట్లను శ్రీగణేష్‌ పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు బోర్డు మాజీ వైస్‌ చైర్మన్‌ జంపన ప్రతాప్‌, కాంగ్రెస్‌ నాయకులు మురళి ముదిరాజ్‌, మధు, తిరుమలగిరి పీఎస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలి


అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న నాయకులు

లాలాపేట: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలనీ ఎంఆర్‌పీఎస్‌ నాయకుడు, దరువు ఎల్లన్న డిమాండ్‌ చేశారు. ఫిబ్రవరి 7న నిర్వహించనున్న వేల గొంతులు, లక్ష డప్పులు భారీ సాంస్కృతిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ తార్నాక డివిజన్‌ మాదిగ సంఘాల నాయకులు సోమవారం లాలాపేటలో డప్పుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లాలాపేటలోని అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాల వేసి నేతలు నివాళులర్పించారు. కార్యక్రమంలో పాకాల నాగరాజు, ముత్యాల గీతాదయాకర్‌ పాల్గొన్నారు.

వ్యర్థాలు తొలగించరా?

బౌద్ధనగర్‌: రోడ్డు నిర్మించి నెల రోజులు గడుస్తున్నా అధికారులు మట్టి వ్యర్థాలను తొలగించడంలో నిర్లక్ష్యం కనబరుస్తున్నారని బౌద్ధనగర్‌ బీజేపీ డివిజన్‌ అధ్యక్షులు సాయి ప్రసాద్‌ గౌడ్‌ అన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రోడ్డు వేసిన అనంతరం వ్యర్థాలను తొలగించక పోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.


ప్రధాన రోడ్డుపై మట్టి వ్యర్థాలు

వసంత పంచమి వేడుకల్లో నిజాం వారసుడు



- ముఖ్య అతిథులుగా పాల్గొన్న టర్కీ కాన్సుల్‌ జనరల్‌, బ్రిటిష్‌ డిప్యూటీ హై కమిషనర్‌

సాక్షి, సిటీబ్యూరో: ఉమ్మడి సాంస్కృతిక వారసత్వాన్ని పెంపొందించడం, మతాల మధ్య అవగాహనను ప్రోత్సహించడం చాలా ముఖ్యమని అసఫ్‌ జాహి రాజవంశానికి చెందిన నిజాం వారసుడు రౌనక్‌ యార్‌ ఖాన్‌ తెలిపారు. సికింద్రాబాద్‌లోని కీస్‌ హై స్కూల్‌లో జరిగిన వార్షిక వసంత పంచమి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సరస్వతి దేవి పూజతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ రెండు రోజుల కార్యక్రమంలో హిందీ, బెంగాలీ సాంస్కృతిక ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. సూఫీ సంప్రదాయాలు, హిందూ ఆచారాలతో ముడిపడి ఉన్న చారిత్రక అంశాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రౌనక్‌ యార్‌ ఖాన్‌ మాట్లాడుతూ.. లౌకికవాదం, మతాల మధ్య సంభాషణను ప్రోత్సహించడానికి ఈ ఉత్సవాలు అద్భుత వేదికని అన్నారు. కార్యక్రమంలో టర్కీ కాన్సుల్‌ జనరల్‌ ఓర్హాన్‌ యల్మాన్‌ ఒకాన్‌, బ్రిటిష్‌ డిప్యూటీ హై కమిషనర్‌ గారెత్‌ విన్‌ ఓవెన్‌ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు.

బహిరంగసభకు అనుమతివ్వాలి

అమీర్‌పేట: నగరంలో మాదిగలు నిర్వహించతలపెట్టిన లక్ష డప్పుల వేయి గొంతుల బహిరంగ సభకు అనుమతి ఇవ్వాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం బహిరంగ లేఖ రాశారు. వర్గీకరణ బిల్లుకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పునివ్వడం, రాష్ట్ర ప్రభుత్వం కూడా అందుకు అనుకూలంగా సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్త చేస్తున్నారని తెలిపారు. బహిరంగ సభతో ప్రభుత్వానికి కాని,శాంతి భద్రతలకు కాని ఎక్కడ ఆటంకం లేకుండా నిర్వహించే బాధ్యత తాను తీసుకుంటానని స్పష్టం చేశారు.అందువల్ల సభకు అన్ని రకాల అనుమతులు ఇవ్వాలనే ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని లేఖలో పేర్కొన్నారు.

పోస్టర్‌ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు ఈ నెల 7న జరిగే వేల గొంతులు.. లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్‌ఎఫ్‌ నాయకులు పల్లెర్ల సుధాకర్‌మాదిగ, కొమ్ము శేఖర్‌మాదిగ కోరారు. సోమవారం ఆర్ట్స్‌ కాలేజీ ఎదుట వాల్‌ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఇదిలా ఉండగా లక్షల డప్పుల కార్యక్రమానికి ఓయూ జేఏసీ చైర్మన్‌ కొత్తపల్లి తిరుపతి, ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు పాపారావు తదితర నాయకులు సంఘీభావం తెలిపారు.


పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎంఎస్‌ఎఫ్‌ నేతలు

మమ్మల్ని తిరిగి విధుల్లోకి తీసుకోండి

పంజగుట్ట: చిన్నచిన్న కారణాలు, తప్పులు చూపించి రిమూవ్‌ ఫర్‌ సర్వీస్‌ చేసిన హోంగార్డులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఉద్యోగం నుంచి తొలగించిన హోంగార్డులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేందర్‌, రామకృష్ణ, సురేష్‌లు మాట్లాడుతూ 10 నుంచి 15 సంవత్సరాలు హోంగార్డులుగా విధులు నిర్వహించిన తాము గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 211 మందిని చిన్నచిన్న ఆరోపణలు, అనారోగ్య సమస్యలతో విధులకు గైర్హాజరైనందుకు సర్వీస్‌ నుంచి రిమూవ్‌ చేశారని తెలిపారు. ఉద్యోగాలు కోల్పోయిన తాము కుటుంబాలు పోషించుకోలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతున్నామన్నారు. న్యాయస్థానం ఆశ్రయించగా న్యాయస్థానం కూడా తమను విధుల్లోకి తీసుకోవాలని సూచించిందని, అయినా తీసుకోలేదన్నారు. కాంగ్రెస్‌ ప్రజా ప్రభుత్వంలో తమకు న్యాయం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. హోంగార్డుల సమస్యలు తెలిసిన నగర పోలీస్‌ కమీషనర్‌ సి.వి ఆనంద్‌ తమకు న్యాయం చేయాలని కోరారు.

విద్యార్థులకు నోట్‌ పుస్తకాలు, పలకల పంపిణీ


చిన్నారులకు పలకలు, నోట్‌ పుస్తకాలు అందజేస్తున్న వెల్లాల రామ్మోహన్‌...

సనత్‌నగర్‌: వసంత పంచమి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. సనత్‌నగర్‌ హనుమాన్‌ దేవాలయ ప్రాంగణంలోని సరస్వతీ అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. బీజేపీ సీనియర్‌ నేత వెల్లాల రామ్మోహన్‌ ఆధ్వర్యంలో బాల బాలికలకు పలకలు, నోట్‌ పుస్తకాలు, పెన్సిల్‌ బాక్స్‌లు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌ యాదవ్‌, అమ్ము రామ్‌ప్రసాద్‌, రవిచంద్ర, చైతన్య, సీవీ శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

రైలుకిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్‌: రైలుకిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు.ఈ ఘటన సోమవారం సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. ఉదయం 5 గంటల ప్రాంతంలో రైల్వే స్టేషన్‌ లోని 2 వ నెంబర్‌ ప్లాట్‌ఫామ్‌ చివరన మృతదేహం ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు సుమారు 50 సంవత్సరాల వయసున్న వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తించారు. మృతుడి గుర్తింపు కోసం ఎటువంటి ఆధారాలు పోలీసులకు లభించలేదు. ఒంటిపై నీలి, ఆకుపచ్చ తెలుపు రంగులు కలిగిన టీ షర్ట్‌, తెలుపు రంగు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

వైభవంగా ఆదిత్యాది విగ్రహ ప్రతిష్ఠ


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌

పద్మారావునగర్‌: సికింద్రాబాద్‌ బన్సీలాల్‌పేట్‌ డివిజన్‌ బోలక్‌పూర్‌లోని శ్రీ మల్లికార్జునస్వామి దేవాలయంలో సోమవారం శ్రీ ఆదిత్యాది నవగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య సాగింది. ముఖ్య అతిథిగా హాజరైె ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌ను ఆలయ పండితులు ఆశీర్వచనం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌ కె. హేమలత, మాజీ కార్పొరేటర్‌ ఏసూరి సావిత్రి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ నేత సుదర్శన్‌రావు మృతికి ఎమ్మెల్యే సంతాపం


సుదర్శన్‌రావు మృతికి సంతాపం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌

సనత్‌నగర్‌: సనత్‌నగర్‌కు చెందిన బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు సుదర్శన్‌రావు మృతి పట్ల మాజీ మంత్రి, సనత్‌నగర్‌ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ సంతాపం తెలిపారు. క్రిస్టియన్‌ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న సుదర్శన్‌ రావు మృతి విషయాన్ని తెలుసుకుని సనత్‌నగర్‌ ఆదిత్యనగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి నివాళులఅర్పించారు. బీఆర్‌ఎస్‌ నాయకులు ఖలీల్‌, సంతోష్‌, శేఖర్‌, షాబాద్‌ శ్రీనివాస్‌, ప్రశాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి

వెంగళరావునగర్‌: కానిస్టేబుల్‌పై ఓ యువకుడు దాడిచేసిన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం ... హజారీ సంజయ్‌ మధురానగర్‌కాలనీలో వ్యాపారం చేస్తుంటాడు. ఆదివారం రాత్రి అతని కుమారుడు హజారీ ఓంసింగ్‌ గొడవపడ్డాడు. దీంతో హజారీ సంజయ్‌ పోలీసులకు ఫోన్‌ చేయగా కానిస్టేబుల్‌ ఆర్‌.నవీన్‌గౌడ్‌ ఆ ప్రాంతానికి వెళ్లి ఓంసింగ్‌ను వారించాడు. అయినప్పటికీ మాట వినకపోవడంతో తన ట్యాబ్‌ నుంచి వీడియో తీశాడు. దాంతో ఆగ్రహించిన యువకుడు కానిస్టేబుల్‌ వద్ద ఉన్న ట్యాబ్‌ లాక్కుని విసిరేశాడు. అనంతరం కానిస్టేబుల్‌పై దాడి చేశారు. ఈ సంఘటనలో కానిస్టేబుల్‌కు గాయాలయ్యాయి. కానిస్టేబుల్‌ ఫిర్యాదు మేరకు మధురానగర్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ట్రాలీ మాయం

వెంగళరావునగర్‌: పార్క్‌ చేసిన ఆటో ట్రాలీ మాయమైన సంఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రహమత్‌నగర్‌లో నివసించే మహ్మద్‌ నజీర్‌ ఆటో ట్రాలీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. శనివారం రాత్రి తన ఆటో ట్రాలీ వాహనాన్ని కార్మికనగర్‌ చౌరస్తాలో పార్క్‌ చేసి మరుసటి రోజు వచ్చి చూడగ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో బాధితుడు మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


విజేతలకు బహుమతులు అందజేసిన డాక్టర్‌ కోట నీలిమ

బన్సీలాల్‌పేట్‌: విద్యార్థుల మానసిక, శారీరక ఎదుగుదలకు క్రీడలు దోహదపడుతాయని కాంగ్రెస్‌ పార్టీ సనత్‌నగర్‌ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్‌ కోట నీలిమ అన్నారు. కేవీఎస్‌ రామశర్మ మెమోరియల్‌ ఫుట్‌బాల్‌ కప్‌ టోర్నమెంట్‌ విజేతలకు డాక్టర్‌ కోట నీలిమ బహుమతులను అందజేశారు. ఈ పోటీలు సికింద్రాబాద్‌ బోయిగూడలోని సెంట్‌ జాన్‌ మేరీ వియానీ చర్చ్‌ గ్రౌండ్స్‌లో జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్‌ కోట నీలిమ హాజరై మాట్లాడుతూ.. విద్యతో పాటు విద్యార్థులను క్రీడాల పరంగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు చిరంజీవి, రమేష్‌, శ్రీనివాస్‌, జగదీష్‌, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీల లెక్క తప్పింది

ఉస్మానియా యూనివర్సిటీ: కులగణన సర్వే నివేదికలో బీసీల జనాభా శాతాన్ని తక్కువ చూపారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్‌ సోమవారం పేర్కొన్నారు. తమ అంచనా ప్రకారం బీసీల జనాభా 60 శాతం కాగా తక్కువ చేసి బీసీలను మోసగించారని ధ్వజమెత్తారు. అధికారానికి దగ్గర్లో ఉన్న బీసీలను గతంలో కంటే తక్కువగా చూపించారన్నారు. కులాల వారిగా జాబితాను ప్రకటించాలని డిమాండ్‌ చేశారు.

మధ్యతరగతి జీవులకు ఉపశమనం

ఐటీ నిపుణులు పీవీఎస్‌ఎస్‌ ప్రసాద్‌



సమావేశంలో మాట్లాడుతున్న పీవీఎస్‌ఎస్‌ ప్రసాద్‌

రాంగోపాల్‌పేట్‌: కేంద్ర ఆర్థిక మంత్రి పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ భారత అభివృద్ధిని వేగవంతం చేయడంతో పాటు సమ్మిళిత అభివృద్ధికి అద్దం పడుతుందని ప్రముఖ ట్యాక్స్‌ నిపుణులు పీవీఎస్‌ఎస్‌ ప్రసాద్‌ తెలిపారు. సికింద్రాబాద్‌ తాజ్‌ హోటల్‌లో సోమవారం కేంద్ర బడ్జెట్‌పై తెలంగాణ, ఏపీ ట్యాక్స్‌ బార్‌ అసోసియేషన్‌ ప్యానెల్‌ చర్చ నిర్వహించింది. ఈ చర్చలో రెండు రాష్ట్రాలకు చెందిన ట్యాక్స్‌ నిపుణులు, ట్యాక్స్‌ కన్సల్టెంట్‌లు, ట్యాక్స్‌ అడ్వకేట్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ బడ్జెట్లో గణనీయమైన మార్పులు తీసుకుని వస్తూ రూ.12లక్షల ఆదాయం వరకు ఎలాంటి ఆదాయపు పన్ను చెల్లించకూడదనే నిర్ణయం మధ్య తరగతి, వేతన జీవులకు, పన్ను చెల్లింపుదారులకు ఉపశమనం కలిగించిందన్నారు. తయారీ వృద్ధికి కీలక రంగాలపై దృష్టిపెట్టడంతో పాటు స్టార్టప్‌లు, ఎంఎస్‌ఎంఈలకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా సంస్కరణలు తీసుకుని రావడం హర్షించదగ్గ విషయం అన్నారు. చంద్రశేఖర్‌ వేముల, హితేష్‌ జైన్‌ పాల్గొన్నారు.

బాలుడి కిడ్నాప్‌ కేసులో నిందితులకు ఏడాది జైలు

సికింద్రాబాద్‌: సికింద్రాబాద్‌ రైల్వే స్టేషన్‌లో బాలుడిని కిడ్నాప్‌ చేసిన కేసులో ముగ్గురు మహిళ నిందితురాళ్లకు సికింద్రాబాద్‌ రైల్వే కోర్టు సోమవారం ఏడాది జైలు శిక్ష, రెండు వేల జరిమానా విధించింది. సికింద్రాబాద్‌ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్‌ సాయి ఈశ్వర్‌గౌడ్‌ తెలిపిన మేరకు.. 2018 అక్టోబర్‌ 20న యూపీకి చెందిన సంజు చమర్‌ స్వగ్రామానికి వెళ్లేందుకు తన కుమార్తె అంజలి (6), ఆయుష్‌ (4)తో కలిసి సికింద్రాబాద్‌ రైల్వే స్టేషన్‌కు వచ్చింది. ఇద్దరు పిల్లలను జనరల్‌ వెయిటింగ్‌ హాలులో ఉంచి టిఫిన్‌ తీసుకుని వచ్చే సరికి కుమారుడు ఆయుష్‌ కనిపించ లేదు. వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసికుని దర్యాప్తు ప్రారంభించగా నగరానికి చెందిన అంజమ్మ, యాదమ్మ, జయమ్మలు బాలుడిని కిడ్నాప్‌ చేసినట్లు గుర్తించి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన అన్ని రకాల సాక్షాలను పరిశీలించిన జడ్జి గౌస్‌ పాషా నిందితులకు శిక్ష ఖరారు చేశారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలల పాటు అదనంగా శిక్ష అనుభవించాల్సి ఉంటుంది.

ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలి

ప్రొఫెసర్‌ ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్‌: పనిచేసే సంస్థ పట్ల ఉద్యోగులు నిబద్ధతగా ఉండాలని, చేసే పనిలో పారదర్శకత అవసరమని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ సార్వత్రిక విశ్వ విద్యాలయ ఉప కులపతి ఆచార్య ఘంటా చక్రపాణి పేర్కొన్నారు. సెంటర్‌ ఫర్‌ స్టాఫ్‌ ట్రైనింగ్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ (సీఎస్‌టీడీ) ఆధ్వర్యంలో ఇటీవల టీజీఎస్పీ ద్వారా నియమితులైన జూనియర్‌ అసిస్టెంట్‌ సిబ్బందికి వారం రోజులపాటు జగరనున్న 'ఆఫీసు అడ్మినిస్ట్రేషన్‌ ఫర్‌ జూనియర్‌ అసిస్టెంట్స్‌' శిక్షణ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.

నేటి నుంచి 28 వరకు ఉచిత కేన్సర్‌ నిర్ధారణ శిబిరం

బంజారాహిల్స్‌: ప్రపంచ కేన్సర్‌ దినోత్సవాన్ని పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్‌ కేన్సర్‌ హాస్పిటల్‌ అండ్‌ రీసెర్చ్‌ ఇనిస్టిట్యూట్‌లో ఉచిత కేన్సర్‌ నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కేన్సర్‌ వైద్య నిపుణులచే ఉచిత ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తారన్నారు. తదుపరి అవసరమైన వారికి 20 శాతం తగ్గింపుతో వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించుకోవడానికి వీలు కల్పిస్తారన్నారు. అంతేకాకుండా ఫిబ్రవరి నెలంతా అత్యంత తక్కువ ఖర్చుతో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ తీసుకునే సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. కేవలం ఒక డోసు సుమారు 4వేల రూపాయలు ఖరీదైన ఈ వ్యాక్సిన్‌ రూ.1500లకే అందించనున్నామన్నారు. 9 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల వయస్సు కలిగిన ఆడపిల్లలకు ఆరునెలల వ్యవధిలో రెండు డోసుల ఇంజక్షన్లు తీసుకోవాల్సి ఉండగా, 15 నుంచి 26 వయస్సున్న యువతులకు మూడు డోసుల వ్యాక్సిన్‌ అంటే ఆరు నెలల వ్యవధిలో మూడు డోసులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ పథకం ఫిబ్రవరి మాసంలో మొదటి డోసు తీసుకున్న వారికి మాత్రమే అందుబాటులో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.